స్థాపితం : 1930 LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు | జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

# జమీన్‌రైతు

సంపుటి : 78 సంచిక 18 4-5-2007 శుక్రవారం 16 పేజీలు విడి ప్రతి : రూ. 5/-




★ Sony MP3 with 2 years warranty
★ 0% Interest Finance
సీట్ కవర్స్, రిమోట్ లాకింగ్, పవర్ విండోస్,
హారన్స్, ఫిల్మ్, బాడీ కవర్స్

PIT STOP
ULTIMATE IN CAR ACCESSORIES
SONY
Beside AC Subba Reddy Stadium
G.N.T.Road, Dargamitta, Nellore - 524 004.
Ph: 0861 - 6450789, 2301919, 94400 88255

D.R. UTTHAMA HOTEL
Winner of EXCELLENCE AWARD 2004, 05 & 06



INDRALOK, A Banquet Hall
Nellore - 524 003. Ph: 0861 - 2317777

### మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరు పర్యటన సఫలం

# తొలిచూపులోనే వలపు!

పంచ భర్తలకు ఆలి అయిన ద్రౌపదిని పాంచాలి అంటారు; ఐదు శాఖలకు మంత్రి అయిన ఆనం రామనారాయణరెడ్డిని "పాంచాలుడు" అనవచ్చా? శాఖ స్త్రీలింగమే, ఐదుగురు ఆలులకు భర్తగా ఈ పిలుపు తప్పు కాదేమో. రాజశేఖరరెడ్డి పెద్ద చిక్కు తెచ్చి పెట్టాడు. మంత్రి పదవి ఇవ్వవయ్యా మహానుభావా అంటే, ఒకేసారి ఐదు శాఖలు అంటగట్టాడు. ప్రతిసారీ ఐదు శాఖల పేర్లు చెప్పి పరిచయం చెయ్యాలంటే చీకాకు; ఐదు శాఖల మంత్రి అందామా అంటే, అదీ అందగించడం లేదు. సంస్కృత పండితులను అడిగితే, "పంచాననుడు" అనమంటున్నారు. పంచ ముఖాలు కల్గినవాడు, శివుడు అని అర్థమట. కానీ పంచాననుడు అంటే, ఈ విలేకరికే నోరు తిరగడం లేదు. పాఠకులకది పంటి క్రింద రాయి వలె పడుతుంది. అందువల్ల ఆనం రామనారాయణరెడ్డికి పాంచాలుడు అనే పొట్టిపేరే ఖాయం చేస్తున్నాము. వినడానికి అదేమైనా ఇబ్బంది అనిపిస్తే పాంచాల మంత్రి అందాము.



జమీన్‌రైతు కార్యాలయానికి వచ్చిన మంత్రి రామనారాయణరెడ్డికి తను పుట్టిన సంవత్సరం 1952 నాటి జమీన్‌రైతు ఫైలును చూపెడుతున్న తూపిలి వనమాలి, అల్లూరు రహీం.

తొలి చూపులోనే వలపు కురిపించగలిగినవాడు ప్రేమలో సఫలమవుతాడని ప్రేమ పురాణాలన్నీ ఘోషిస్తున్నాయి. తన మంత్రి పదవి విషయంలో కూడా ఆ తొలి చూపుల ప్రభావం ప్రదర్శింప చేయడానికి చాలా పకడ్బందీ ప్రయత్నం చేస్తున్నాడు పాంచాల మంత్రి రామనారాయణ. తనకు మంత్రి పదవి ఇవ్వడం సరైన నిర్ణయం అన్న అభిప్రాయాన్ని ముఖ్యమంత్రిలోను, తనకు మంత్రి పదవి ఇస్తే జిల్లా మొత్తం తన అరచేతిలో ఇమిడ్చుకుంటానన్న భావనను జిల్లా కాంగ్రెస్ వాదులలోను కల్గించడం పాంచాల మంత్రి లక్ష్యంగా కన్పడుతున్నది. ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి ఈ వారంలో ఆయన వేసిన ప్రతి అడుగూ ఈ కోవలోనే వుండడం గమనార్హం. అది ఆయనకు చాలా అవసరం కూడా. ఆయనకు మంత్రిత్వం రావడం జిల్లాలో ఏ ఎమ్మెల్యేకూ ఇష్టం లేదు. బయటపడి అయిష్టత ప్రదర్శించక పోయినా, అందరి మనసులలో ఆ గుబులు కొట్టొచ్చినట్లు కన్పిస్తూనే వుంది. మంత్రిత్వానికి తామూ అర్హులమే అన్న భావనే అందుకు కారణం. మంత్రిగా ఆయన తమ మీద ఆధిక్య ప్రదర్శన చేయడం కూడా వారెవరూ అంగీకరించలేని అంశం. అది పాంచాల మంత్రికి బాగా తెలుసు. నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అన్నట్లు, నిన్నటి వరకు ఆయన చేసింది కూడా అదే కదా మరి? జిల్లాలో మొదటగా మంత్రిత్వం పొందిన నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మను వారెంత ఏడిపించుక తిన్నదీ అందరికీ తెలుసు. అసలామెను మంత్రిగా గుర్తించము పొమ్మని భీష్మించుకున్నారు. ఆమెను తమ నియోజక వర్గాలలో కాలు కూడా పెట్టనివ్వలేదు. సందు దొరికితే ఆమె మీద కారాలు మిరియాలు నూరారు; నిప్పులు చిమ్మారు. ఇప్పుడు తనకెక్కడ ఆ చేదు అనుభవాలు ఎదురౌతాయో అన్న



అభినందన సభలో రాజసం ఉట్టిపడేలా రామనారాయణరెడ్డి.

తరువ 14వ పేజీలో



అత్యంత తగ్గింపు ధరలు
హోల్‌సేల్ ధరలకే రిటైల్ అమ్మకం
నూతన డిజైన్‌లతో 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
స్పెషల్ ఆఫర్
సవరకు రూ.400 తగ్గింపు
(గ్రాముకు రూ. 50 తగ్గింపు)
"బంగారం బెనిఫిట్ స్కీమ్"
స్వర్ణాభరణ సౌభాగ్యములో చేరండి అదనపు ఆదాయన్ని పొందండి.
గోల్డ్ ప్యాలెస్
100% BIS 916 HALLMARK SHOW ROOM
మండపాలవీధి, జైన్ దేవాలయం ఎదురుగా, నెల్లూరు. 1
ఫోన్ : 2331133, 2327611,2331564.
ఈ అవకాశం మే 1 నుండి 31 వరకు మాత్రమే

వివాహ మహోత్సవ శుభాకాంక్షలు



ముత్యాల పందిరిలో...
మూడు ముళ్ళ బంధంతో...
ఏడడుగుల అనుబంధంతో...
వేదమంత్రాల సాక్షిగా...
ఒక్కటవుతున్న శుభసందర్భంలో
మా ఆత్మీయులు
కోడూరు కమలాకర్ రెడ్డి - విద్యుల్లత
గార్ల కుమార్తె
చి॥ల॥సౌ॥ సింధూర
చి॥ వెంకట్ కుమార్ రెడ్డి ల
వైవాహిక జీవితం నిండు నూరేళ్ళు
సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆశిస్తూ...!



తమ్మి శ్రీనివాసులు

### కాంగ్రెస్‌కు సేవ చేయడమే....

# సివి శేషారెడ్డికి శాపమైందా?

స్థానిక సంస్థల స్థానం నుంచి శాసనమండలికి జరిగిన ఎన్నికలలో అధికార కాంగ్రెస్ అభ్యర్థి సివి శేషారెడ్డి దారుణమైన ఓటమి చవిచూశాడు. కాంగ్రెస్ పార్టీ పరువును పెన్నలో కలిపిన ఓటమి ఇది. స్థానిక సంస్థల ఎన్నికలలో ఎమ్పీటీసి, జడ్పీటీసి సభ్యులు, మునిసిపల్ కౌన్సిలర్, కార్పొరేటర్లు ఓటర్లు. జిల్లా మొత్తం మీద వీరి సంఖ్య 795 అయితే, అందులో కాంగ్రెస్‌కు 430 మంది వున్నారు. అంటే సగం కంటే ఎక్కువ. తెలుగుదేశం పార్టీకి కేవలం 292 మంది మాత్రమే వున్నారు. సిపిఎం సంఖ్య 26. సిపిఐకి వున్నది ఒకటంటే ఒకటి. బిజెపిది 14 ఓట్ల నామమాత్ర బలం. ఈ అన్ని పార్టీలు


విజయదరహాసంతో రాఘవ

కలిసినా కాంగ్రెస్ అభ్యర్థి సివి శేషారెడ్డి నిరపాయకరంగా గెలిచి తీరాలి. కానీ ఫలితాలు లెక్కించి చూసేసరికి కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థి బొమ్మిరెడ్డి రాఘవేంద్రకు 414 ఓట్లు వస్తే, కాంగ్రెస్ సివి శేషారెడ్డికి కేవలం 367 ఓట్లు వచ్చాయి. 14 ఓట్లు చెల్లలేదు. మొత్తం మీద 47 ఓట్ల మెజారిటీతో విజయం సాధించాడు రాఘవేంద్రరెడ్డి.

రాఘవేంద్ర కాంగ్రెస్ కుటుంబం నుంచి వచ్చినవాడు. ఆయన తండ్రి డాక్టర్ బి.సుందరరామరెడ్డి ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఒకటికి నాలుగుసార్లు గెలిచిన కాంగ్రెస్ నాయకుడు. ముప్పయ్యేళ్ల ప్రజా జీవితంలో వేలెత్తి చూపే మచ్చ లేని పెద్ద మనిషి. ఇప్పటి ఎమ్మెల్యేల వలె పదవిలోకి వచ్చిన రోజు నుంచి కమీషన్లు, పర్సంటేజీలు దిగమ్రింగుతూ, మిద్దెలు మేడలు కట్టినవాడు కాదు. గెలిచినా, ఓడినా ఒక తీరులో ప్రజల మధ్య తిరిగినవాడు. తన టిక్కెట్‌ను మరొకరికి ఇచ్చినా అవమానం భరించి, కాంగ్రెస్‌కు కట్టుబడిన ఉత్తముడు. అంత ఉన్నతమైన కాంగ్రెస్ సంస్కృతిని వారసత్వంగా పుణికి పుచ్చుకున్న రాఘవేంద్ర ఈ ఎన్నికలలో గెలుపొందడానికి అన్ని విధాలా అర్హుడని వేరే చెప్పనవసరం లేదు. అయితే ఆయనీరోజు ఎమ్మెల్సీ కావడానికి ఈ అర్హతలేవీ కారణం కాదు. చేతికి ఎముక లేదన్నంత ధారాళంగా, వెనుకాముందు చూడకుండా వెదజల్లిన డబ్బు ఒక్కటే రాఘవేంద్రను గెలిపించిందనడం నిజం. చాలా సాహసం చేశాడు రాఘవేంద్ర. పదవి కోసం కాక, కాంగ్రెస్ నేతలు తనకు, తన కుటుంబానికి అన్యాయం చేశారు కాబట్టి, బుద్ధి చెప్పాలన్న కసితో, అక్కసుతో పోటీకి దిగాడు. పరిస్థితులు కూడా కలిసి వచ్చాయి. తెలుగుదేశం పార్టీకి పోటీచేసే బలం లేదు. అందువల్ల ఆ పార్టీలో ఎవరిని నిలబడమని కోరినా, మళ్లీ కన్పించకుండా పారిపోయారు. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, బీదా రవిచంద్ర, ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, వేనాటి చంద్రారెడ్డి వంటి వారంతా వెనక్కు తగ్గారు. దానితో స్వతంత్రుడిగా నిలబడడానికి సిద్ధపడిన రాఘవేంద్రకు బేషరతుగా మద్దతు పలికాడు టిడిపి జిల్లా నేత సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి.

> **జిల్లా ఎమ్మెల్యేల అహంకారం, ధిక్కార ధోరణులకు నిస్సహాయంగా బలైపోయాడు సివి శేషారెడ్డి. రాజకీయ చరమాంకంలో విషాదకర అనుభవమాయనది.**

వస్తే కొండ, పోతే వెంట్రుక అన్న ధోరణిలో వేసిన రాజకీయ ఎత్తుగడ ఇది. అదే సమయంలో కాంగ్రెస్ అధికార అభ్యర్థి సివి శేషారెడ్డి పట్ల ద్వేషంతో మండిపడుతున్న సర్వేపల్లి శాసన సభ్యుడు ఆదాల ప్రభాకరరెడ్డి, ప్రస్తుత మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎమ్మెల్యే ఆనం వివేకానంద రెడ్డి, కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, వీరందరితో కలిసి ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి శేఖరరెడ్డి పార్టీకి వెన్నుపోటు పొడుస్తామన్న సంకేతాలు ఇచ్చారు. అప్పటి వరకు ఊగిసలాటలో వుండిన ఆత్మకూరు ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు కూడా తెగబడి, రాఘవేంద్ర పక్కన నిలబడ్డాడు. అంత బలీయమైన


అవమానభారంతో సివి

మద్దతు కళ్లముందు కన్పిస్తుండడంతో రాఘవేంద్రకు ఎక్కడలేని ధైర్యం వచ్చింది. డబ్బు సంచులు బయటకు తీశాడు. తెలుగుదేశం ఓటర్లకు తలా పాతిక వేలు; కాంగ్రెస్ నుంచి క్రాస్ ఓటింగ్‌కు సిద్ధపడిన వారికి నలభై నుంచి యాభై వేల వరకు తిరనాళ్లలో గుగ్గిళ్లు, పంచకజ్జాయం పంచి పెట్టినంత వుదారంగా పంచి పెట్టాడు. ఈ ధోరణి చూసి సివి శేషారెడ్డి కూడా కాంగ్రెస్ ఓటర్లకు తలా పది నుంచి పాతిక వేల వరకు డబ్బు ఇచ్చినా చాలలేదు. త్రాసులో పది కంటే యాభై వేల కట్ట ఎక్కువ తూకం తూగుతుంది కదా?

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సిగ్గుపడవలసిన విషయం ఇది. అంత బలం, అంత

తొరవ 14వ పేజీలో

### ఎసి సెంటర్‌లో రామనారాయణ అభినందోత్సవం


రామనారాయణరెడ్డికి ముస్లింల సాంప్రదాయ పద్ధతిలో సేరాసు ధరింపజేసిన మైనార్టీ నాయకులు.


అభినందోత్సవ వేదికపై మాగుంట పార్వతమ్మ, పనబాక లక్ష్మి, రామనారాయణ, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆదాల ప్రభాకరరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి.


ఎసి సెంటర్‌లో జనసందోహం.




## శ్రీ మల్లిఖార్జునస్వామి కామాక్షితాయి దేవస్థానం

జొన్నవాడ గ్రామం, బుచ్చిరెడ్డిపాళెం మండలం, నెల్లూరు జిల్లా. ఫోన్స్ : 08622- 273595, 253095

**బ్రహ్మోత్సవ ఆహ్వానం**

7.5.2007 నుండి 17.5.2007 వరకు జరుగు వార్షిక బ్రహ్మోత్సవాలకు

కామాక్షితాయి భక్తులకు స్వాగతం – సుస్వాగతం!

13.05.2007 రావణసేవ
14.05.2007 వెండి నంది సేవ
15.05.2007 రథోత్సవము
16.05.2007 కళ్యాణం ఉదయం 9గం॥లకు, రాత్రి 7గం॥లకు తెప్పోత్సవము.

9.5.2007 నుండి ప్రతి రోజూ రాత్రి 7 గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమములు కలవు.

కావున భక్తులెల్లరూ అమ్మవారిని దర్శించి వారి కృపా కటాక్షములు పొందగలరు.

సన్నపురెడ్డి వేణుగోపాలరెడ్డి, ఛైర్మన్
మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి
శ్రీ జొన్నవాడ కామాక్షితాయి దేవస్థానం, జొన్నవాడ

# సింహపురి ముద్దు బిడ్డకు స్వాగతం! సుస్వాగతం!!





డా॥ వై. ఎస్. రాజశేఖరరెడ్డి — ముఖ్యమంత్రివర్యులు

శ్రీమతి పనబాక లక్ష్మి — కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి, Ex-officio సభ్యులు

శ్రీమతి పులిమి శైలజ — మేయర్, నగర పాలక సంస్థ, నెల్లూరు

శ్రీ ఆనం వివేకానందరెడ్డి — శాసనసభ్యులు, నెల్లూరు, Ex-officio సభ్యులు

శ్రీ ఆదాల ప్రభాకరరెడ్డి — శాసనసభ్యులు, సర్వేపల్లి, Ex-officio సభ్యులు

రాజకీయ ప్రాభవ కీర్తిపతాక, మెట్ట ప్రాంత రైతుల ఆశాజ్యోతి

## శ్రీ ఆనం రామనారాయణరెడ్డి గారు

రాష్ట్ర సమాచార, సాంస్కృతిక, పురావస్తు, సినిమాటోగ్రఫీ మరియు
పర్యాటక శాఖామాత్యులుగా ప్రమాణ స్వీకారం చేసి నెల్లూరుకు విచ్చేసిన శుభ సందర్భంగా
వారికి మా హార్దిక శుభాభినందనలు.



మాదాల వెంకటేశ్వర్లు — డిప్యూటీ మేయర్
కత్తి శ్రీనివాసులు — 1వ డివిజన్ కమిటీ చైర్మన్
వై.వి.సుబ్బారావు — 2వ డివిజన్ కమిటీ చైర్మన్
నన్నపురెడ్డి పెంచలరెడ్డి — 3వ డివిజన్ కమిటీ చైర్మన్
చాట్ల నరసింహారావు — 4వ డివిజన్ కమిటీ చైర్మన్
పిండి సురేష్ — 5వ డివిజన్ కమిటీ చైర్మన్



మండవ రాణి — 1వ డివిజన్
షేక్ మస్తానమ్మ — 2వ డివిజన్
ఐద్రి మంజుల — 3వ డివిజన్
సంక్రాంతి కళ్యాణ్ — 4వ డివిజన్
పి.ఓంప్రకాష్ — 5వ డివిజన్
కిన్నెర ప్రసాద్ — 6వ డివిజన్



కె.శేషయ్య — 7వ డివిజన్
లలిత మహిపాల్ — 8వ డివిజన్
ఉషారాణి — 9వ డివిజన్
కె.కొండమ్మ — 11వ డివిజన్
కోటంరెడ్డి సంధ్య — 12వ డివిజన్
వి.లలితారామ్ — 13వ డివిజన్
యు.ఆదిశేషయ్య — 14వ డివిజన్



టి.అనూరాధ — 15వ డివిజన్
యు.కేశవరావు — 16వ డివిజన్
ఎ.వి.రాణి — 17వ డివిజన్
శివగిరి చక్రవర్తి — 18వ డివిజన్
ఎస్.రమాదేవి — 19వ డివిజన్
పి.సుధాకర్ — 20వ డివిజన్
వి.రజని — 21వ డివిజన్



కె.తిరుపతినాయుడు — 22వ డివిజన్
మేకల నరేంద్రరెడ్డి — 23వ డివిజన్
షాహినా బేగం — 24వ డివిజన్
సి.హెచ్.సుభాషణమ్మ — 26వ డివిజన్
ఆర్.వెంకటజ్యోతి — 28వ డివిజన్
ఎం.కామాక్షి — 29వ డివిజన్
స్వర్ణా వెంకయ్య — 30వ డివిజన్



ఎం.శాలిని — 31వ డివిజన్
మదన్‌మోహన్‌రెడ్డి — 32వ డివిజన్
భానుశ్రీ — 33వ డివిజన్
టి.వెంకటేశ్వరరావు — 34వ డివిజన్
పి.రూప్‌కుమార్ — 37వ డివిజన్
జరీనా సుల్తానా — 39వ డివిజన్
పి.రామకృష్ణారెడ్డి — 40వ డివిజన్
ఎ.జయకుమార్‌రెడ్డి — 41వ డివిజన్
ధర్మవరపు సుబ్బారావు — 42వ డివిజన్
చిన్న పెంచలయ్య — 43వ డివిజన్



సందాని బాషా — 44వ డివిజన్
దువ్వూరి శరత్చంద్ర — 45వ డివిజన్
కె.వెంకటసుధీర్ — 46వ డివిజన్
కప్పిర శ్రీనివాసులు — 47వ డివిజన్
దారా మరియమ్మ — 48వ డివిజన్
మునాఫ్ — 49వ డివిజన్



డి.కరుణచంద్రబాబు,
కమీషనర్

## నగర పాలక సంస్థ, నెల్లూరు


మెట్ట ప్రాంత ప్రజల ఆశాజ్యోతి ఆనం రామనారాయణరెడ్డికి స్వాగతం!
ప్రజాభ్యుదయ పథంలో అలుపెరుగని బాటసారి, రాజకీయ సమరాంగణాన
తిరుగులేని యోధుడు, జన సమస్యా పరిష్కారంలో విశ్రాంతి కోరని నాయకుడు
శ్రీ ఆనం రామనారాయణరెడ్డి గారు
సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ, పర్యాటక, సాంస్కృతిక,
పురావస్తు శాఖామాత్యుని హోదాలో ఉదయగిరి నియోజకవర్గంలో 5వ తేదీన జరిగే
ప్రజాపథం కార్యక్రమంలో పాల్గొనను వస్తున్న శుభసందర్భాన స్వాగతం! సుస్వాగతం!!
ఉదయగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు


హార్దిక శుభాకాంక్షలు
ఆనం వంశ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేస్తూ,
అందరి హృదయాలలో 'రామన్న'గా
చెరగని ముద్ర వేసుకున్న మా ఆత్మీయులు
శ్రీ ఆనం రామనారాయణరెడ్డి గారు
రాష్ట్ర సమాచార, పౌరసంబంధ, సాంస్కృతిక, పురావస్తు,
సినిమాటోగ్రఫీ మరియు టూరిజం శాఖ మంత్రివర్యులుగా
ప్రమాణ స్వీకారం చేసి సింహపురి నగరమునకు
విచ్చేసిన శుభ సందర్భముగా మా హార్దిక శుభాకాంక్షలు.
APR Constructions Limited,
Hyderabad.
KCL - JCCG (JV), Package No:9
Hyderabad.

# అభినందనమందారమాల!



డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి
ముఖ్యమంత్రివర్యులు



శ్రీ రెడ్డివారి చెంగారెడ్డి గారు
రాష్ట్ర న్యాయ, సాంకేతిక విద్య, పారిశ్రామిక శిక్షణా కేంద్రాల శాఖల మంత్రివర్యులు

కాంగ్రెస్‌కు ఏ ఆధారం లేని రోజుల్లో
ఎన్నో కష్టనష్టాలకోర్చి చిత్తూరు జిల్లాలో
పార్టీకి పట్టుకొమ్మగా నిలచి
విజయలక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ
నాయకులందరినీ సమైక్య పరచి
పార్టీని విజయపథం వైపు నడిపించిన
స్వచ్ఛమైన నాయకుడు, మాకు మార్గదర్శి

**శ్రీరెడ్డివారి చెంగారెడ్డి గారిని**

గుర్తించి రాష్ట్ర న్యాయ, సాంకేతిక విద్య
పారిశ్రామిక శిక్షణా కేంద్రాల శాఖలకు మంత్రివర్యులు చేసిన
రైతు బాంధవుడు, నవ్యాంధ్రప్రదేశ్ స్వాప్నికుడు
ప్రియతమ ముఖ్యమంత్రి
**శ్రీ వైఎస్ రాజశేఖరరెడ్డి గారికి** మా హృదయ పూర్వక కృతజ్ఞతలు.



**దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి**
సూళ్ళూరుపేట మార్కెట్ కమిటీ సభ్యులు
మంగానెల్లూరు సొసైటీ సంఘం అధ్యక్షులు

**డాక్టర్ వాకాటి శ్రీధర్‌రెడ్డి**
అపోలో హాస్పిటల్స్
హైదరాబాద్

**వాకాటి చంద్రారెడ్డి**
కాంట్రాక్టర్, చేనిగుంట
తడ మండలం

**వాకాటి నారాయణరెడ్డి,**
చైర్మన్
నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్

# కృతజ్ఞతలు



ప్రతిష్ఠాత్మకంగా జరిగిన
నెల్లూరు స్థానిక సంస్థల ఎన్నికల్లో
అన్ని సమయాలలో నాకు సహాయ
సహకారాలు అందించిన ఆత్మకూరు M.L.A
శ్రీ కొమ్మి లక్ష్మయ్య నాయుడు గారికి
మీ వెనుక మేమున్నాము మీ గెలుపునకు
సహకరిస్తామని ఎంతో ఆత్మీయంగా
ముందుకు నడిపించిన
తెలుగుదేశం పార్టీ నాయకులకు
C.P.M. పార్టీ నాయకులకు
నా విజయానికి మీ అమూల్యమైన
ఓటు వేసిన స్థానిక సంస్థల ప్రతినిధులకు
పరోక్షంగా నా విజయానికి కృషి చేసిన
రాజకీయ పెద్దలకు, నా అభిమానులకు
మిత్రులకు, శ్రేయోభిలాషులకు
నా హృదయపూర్వక కృతజ్ఞతలు.
ఎల్లవేళలా స్థానిక సంస్థల అభివృద్ధికి కృషి చేస్తానని
మనవి చేసుకుంటూ...



**మీ... బొమ్మిరెడ్డి రాఘువేంద్రరెడ్డి, B.E.,**
**స్థానిక సంస్థల M.L.C., నెల్లూరు.**

Edited, Printed and Published by N. Dolendra Prasad, Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.